అరబిందో బస్సులో మంటలు

స్పందించి ఆర్పేసిన ట్రాఫిక్ సిబ్బంది

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద శుక్రవారం అరబిందో కంపెనీకి చెందిన బస్సు, తమ కంపెనీ ఉద్యోగులను తీసుకొని వెళ్తూ, ఇంజనులో సాంకేతిక లోపం కారణంగా పొగలుతో మంటలు వచ్చాయి. అక్కడ ట్రాఫిక్ రెగ్యులేషన్ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ఎ.ఎం.రాజు, సిబ్బంది సమయానుకూలంగా వ్యవహరించి, స్థానిక ఆటో డ్రైవర్ల సహకారంతో బస్సులోగల ఉద్యోగులను సురక్షితంగా దింపి, బస్సు మంటలను ఫైర్ ఇంజిన్ సహాయంతో ఆర్పడానికి ప్రయత్నం చేశారు. అనంతరం, రహదారి మధ్యలో ఆగిన బస్సును ఆటో డ్రైవర్ల సహకారంతో పక్కకు తొలగించి, వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎ.ఎం.రాజును, సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందించారు.

వర్షాలు కురిసినా.. పెరగని సాగు

అన్ని పంటల్లోనూ తగ్గిన విస్తీర్ణం ● సాగునీటి వనరులు ఉన్నచోటా పెరగని దుస్థితి

ఓవైపు వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు ఖరీఫ్ కాలం మూడు నెలలు దాటిపోయింది. అయినా ఇప్పటికీ పంటల సాగు పెరగడం లేదు. వరి, మొక్కజొన్న మొదులకుని అన్ని పంటల్లోనూ సాగు విస్తీర్ణం తక్కువగానే కనిపిస్తోంది. చివరికి సాగునీటి వనరులు ఉన్న చోట కూడా వరి సాగు లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగలేదు. వరినారు వేసి రెండు నెలలు కావడంతో ఒకవేళ ఇప్పుడు నాట్లు వేసినా పెద్దగా ఉపయోగం ఉండదని రైతులు భావిస్తున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దత్తిరాజేరు మండలం పెదకాదలో నాట్లు పడక బీడుగా ఉన్న భూమి

జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు జూన్ నుంచి మొదలవుతుంది. రుతుపవనాలు సకాలంలో జిల్లాను తాకితే ఆగస్టు ప్రారంభం నాటికి పంటలన్నీ, ముఖ్యంగా వరి నాట్లు పూర్తయ్యేవి. మారిన వాతావరణ పరిస్థితుల వల్ల గడిచిన నాలుగైదేళ్లగా రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో కనీసం ఆగస్టు చివరి దశ లేదా సెప్టెంబర్ రెండో వారం నాటికి వరినాట్లు పూర్తయ్యేవి. మిగిలిన పంటల సాగు కూడా దాదాపు పూర్తికావచ్చేది. ఈ ఏడాది సకాలంలోనే వరి నారు వేసేందుకు వర్షాలు సహకరించినప్పటికీ ఆ తరువాత మండిన ఎండులు, వర్షాభావ పరిస్థితుల వల్ల సకాలంలో ఉబాలు పట్టేందుకు అవకాశం లేకపోయింది. జిల్లాలో ప్రధాన పంట వరి. ఆ తరువాత స్థానంలో చెరకు, మొక్కజొన్న, పత్తి, చిరుధాన్యాలు ఉంటాయి. మొత్తంగా పంటలన్నీ కలుపుకుని గత ఖరీఫ్ సీజన్‌లో 3,02,602 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది సుమారు 3,13,465 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనావేశారు. కానీ, ఆచరణలో ఇప్పటి వరకు కేవలం 2,24,515 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఇదే తేదీ నాటికి 2,56,985 ఎకరాల్లో సాగైనట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీన్ని బట్టి గత సీజన్‌తో పోలిస్తే 78,087 ఎకరాలు, గతేడాది ఇదే సమయంతో పరిశీలిస్తే 32,470 తక్కువగా విస్తీర్ణంలో పంటల సాగు ఉన్నట్టు స్పష్టమౌతోంది.

వరి సాధారణ విస్తీర్ణం 2,25,637 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1,78,357 ఎకరాల్లో మాత్రమే సాగైంది. గతేడాది ఇదే తేదీనాటికి 1,91,537 ఎకరాల్లోనూ, సీజన్ మొత్తానికి 2,34,107 ఎకరాల్లోనూ నాట్లు పడ్డాయి. సాగునీటి వసతి ఉన్నచోట 2,21,470 ఎకరాల్లో ఉబాలు కావాల్సివుండగా, 1.75,782 ఎకరాల్లో మాత్రమే అయ్యాయి. గత ఏడాది ఇదే తేదీనాటికి సాగునీటి వసతి ఉన్నచోట 1,88,957 ఎకరాల్లో నాట్లు పడ్డాయి.

పత్తి సాధారణ విస్తీర్ణం 8,232 ఎకరాలుకాగా, ఇప్పటి వరకు 3,322 ఎకరాల్లో సాగైంది. గత ఏడాది ఇదే సమయానికి 4,445 ఎకరాల్లోనూ, సీజన్ మొత్తంగా 5097 ఎకరాల్లో సాగైంది. చెరకు సాధారణ సాగు విస్తీర్ణం 18,897 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 7,525 మాత్రమే సాగు కనిపిస్తోంది. గత ఏడాది ఇదే సమయానికి 10,475 ఎకరాలు, సీజన్ మొత్తంగా 11,265 ఎకరాల్లో సాగైంది. నువ్వులు, పెసలు, మినుములు, వేరుశనగ తదితర పంటల సాగు కూడా ఈ మేరకు తగ్గింది.

నెల	సాధారణ వర్షపాతం	కురిసింది	వ్యత్యాసం
జూన్	123.5 మి.మీ	59.4మి.మీ	-51.9 మి.మీ
జులై	170.8 మి.మీ	311.5 మి.మీ	+82.4 మి.మీ
ఆగస్టు	189.9 మి.మీ	143.4 మి.మీ	-23.7 మి.మీ
సెప్టెంబర్	46.4 మి.మీ	110.4 మి.మీ	+137.9 మి.మీ
మొత్తం	**528.6 మి.మీ**	**624.7 మి.మీ**	**+18.2 మి.మీ**

స్వల్పంగా పెరిగిన వర్షపాతం

నెలవారీగా వర్షపాతంలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సీజన్ మొత్తంగా పరిశీలిస్తే 18.2 మిల్లీమీటర్ల వర్షం అధికంగానే కురిసింది. కానీ, ఆ నెలవారీ హెచ్చుతగ్గులే పంటల విస్తీర్ణం తగ్గిపోవడానికి మూల కారణంగా కనిపిస్తున్నాయి. జూన్‌లో 51.9 మి.మీ వర్షం తగ్గింది. జులైలో 82.4 మి.మీ పెరిగింది. తిరిగి ఆగస్టులో 23.7 మి.మీ వర్షం తగ్గిపోయింది. సెప్టెంబర్‌లో గడిచిన 9రోజులకు 46.4 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సివుండగా 110.4 పడింది. దీంతో, సీజన్ మొత్తంగా వర్షపాతం పెరిగినప్పటికీ సాగుకు అనుకూలంగా లేకపోవడంతో విస్తీర్ణం తగ్గినట్టుగా స్పష్టమౌతోంది.

తోటపల్లి నుంచి నీరందించాలి

గుర్ల మండలంలో ఏకైక సాగునీటి ప్రాజెక్టు అయిన గడిగెడ్డలో పూర్తిస్థాయిలో నీటినిల్వలు లేకపోవడం తో రైతులు వరినాట్లు వేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. తోటపల్లి ప్రాజెక్ట్ నుండి నీరు గడిగడ్డకు రాక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. తగినంత వర్షాలు లేక నాట్లు పడలేదు. గత నాలుగేళ్లుగా తోటపల్లి నీరు రాకపోయినా నాయకులు పట్టించుకోక పోవడం ఈ ప్రాంత రైతుల దురదృష్టం. ఇప్పటి కైనా అధికారులు ప్రజాప్రతి నిధులు కలుగ చేసుకొని గడిగెడ్డకు తోటపల్లి నీరు తెచ్చేందుకు కృషి చేయాలి.

– కడగల అప్పన్న, రైతు, పల్లిగండ్రేడు, గుర్ల మండలం

రైతు శాస్త్రవేత్తలను రూపొందించాలి

- వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళిక
- ఎపి ప్రకృతి వ్యవసాయం ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయకుమార్

ప్రజాశక్తి-విజయనగరం

మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయకుమార్

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు రైతులను శాస్త్రవేత్తలుగా రూపొందించేందుకు ప్రణాళిక తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఎం.ఎస్.స్వామినాథన్ పురస్కార గ్రహీత టి.విజయ్ కుమార్ కోరారు. జిల్లా అంతటా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని ఆయన సూచిం చారు. జిల్లాలో శుక్రవారం పర్యటించిన విజయకుమార్, ముందుగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తో భేటీ అయ్యారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ప్రకతి వ్యవసాయం, దాని విస్తరణ అవకాశాలపై చర్చించారు.

అనంతరం కలెక్టర్ సమావేశ మందిరంలో వ్యవసాయ అధికారులు, మోడల్ మేకర్స్, మెంటార్స్, రైతు శాస్త్రవేత్తలతో సమావేశం అయ్యారు. జిల్లాలో జరుగుతున్న ప్రకతి వ్యవసాయంపై మండలాల వారీగా సమీక్షించి వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ, ప్రకతి వ్యవసాయంలో రాష్ట్రానికి మూడు జాతీయ అవార్డులు లభించడం పట్ల అధికారులను, సిబ్బందిని అభినందించారు. జిల్లాలో శతశాతం ప్రకృతి వ్యవసాయం చేసేదిశగా కృషి చేయాలని కోరారు. దీనికోసం రైతు శాస్త్రవేత్తలను రూపొందించేందుకు సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న విద్యావంతులైన రైతులను ఎంపిక చేసి పులివెందులలో నాలుగేళ్ల పాటు శిక్షణ ఇప్పించి రైతు శాస్త్రవేత్తగా తయారు చేస్తామని తెలిపారు. వీరి సేవలను ప్రతి ఆర్‌బికెలో వినియోగించు కోవడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతులను గుర్తించి శిక్షణకు పంపించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏడాదికి ఆరోగ్యకరమైన మూడు పంటలను పండించ వచ్చని, అధిక దిగుబడులను సాధించవచ్చునని అన్నారు. దీనివలన నేల స్వభావం అనుకూలంగా మారుతుందని చెప్పారు. వైవిధ్యమైన పంటలను వేయడం ద్వారా కలుపు నివారణ కూడా సాధ్యపడుతుందని సూచించారు.

జిల్లాలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికను మార్చవలసిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గతంలో జూన్ నెలలోనే వర్షాలు పడేవని, కానీ ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా అక్టోబర్ నవంబర్ నెలల్లో మాత్రమే తుపాన్లు వల్ల విస్తతంగా వర్షాలు పడుతున్నాయని చెప్పారు. వర్షాలకు అనుగుణంగా పంటల ప్రణాళికను మార్పు చేయాలని సూచించారు. జూన్‌లో ఆరుతడి పంటలు వేయాలన్నారు. ప్రకృతి సేద్యాన్ని కేవలం వ్యవసాయానికే పరిమితం చేయకుండా, మత్స్య సాగు లాంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. బొండపల్లి మండలం దేవుపల్లి, బొబ్బిలి మండలం మెట్టవలసలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు, ఎపిసిఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు, ఎడి ప్రకాష్, అన్నపూర్ణతో పాటు హేమ సుందర్ పాల్గొన్నారు.

ఐటి నోటీసుపై చంద్రబాబు స్పందించాలి

అల్లర్లు సృష్టించేందుకే లోకేష్ పాదయాత్ర, బాబు బహిరంగ సభలు : వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చంద్రబాబు నాయుడు టిడ్కో ఇళ్ల వ్యవహారంలో అవినీతికి పాల్పడినట్లు ఇన్‌కం టాక్స్ శాఖ ఇచ్చిన నోటీసుకు చంద్రబాబునాయుడు వెంటనే సమాధానం చెప్పాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జెడ్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016, 17, 18 మధ్య టిడ్కో ఇళ్ల నిర్మాణం విషయంలో కాంట్రాక్టర్ దగ్గర నుంచి అప్పటి పిఎ శ్రీనివాస్ ద్వారా ముడుపులు అందినట్లు ఆధారాలతో సహా ఇన్‌కమ్ టాక్స్ శాఖ నోటీసులు ఇచ్చిందన్నారు. ఏ జిల్లా పర్యటనలకు వెళ్లినా, ఎక్కడ బహిరంగ సభ పెట్టినా వైసిపి ప్రజాప్రతినిధులను అవినీతి పరులని చెబుతున్న చంద్రబాబు ఆదాయపు పన్ను శాఖ ఇచ్చిన నోటీసుకు ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు.

నోటీసుపై స్పందించకుండా తనను జైలులో పెట్టేందుకు వైసిపి ప్రభుత్వం చూస్తుందని అనడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఐటి నోటీసుకు సమాధానం చెప్పి నిజాయితీని నిరూపించుకోవాలని అన్నారు. మరోవైపు లోకేష్ చేపట్టిన పాదయాత్ర, బాబు బహిరంగ సభలు

ప్రజా సమస్యలపైన కాకుండా కేవలం రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా, అల్లర్లు సష్టించే విధంగా ఉన్నాయన్నారు. వ్యక్తిగత దూషణలు, దుర్భాషలు మాట్లాడటం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. భీమవరంలో రాళ్లు విసరడం, దాడులకు పాల్పడటం వంటి ఘటనలకు పాల్పడి అల్లర్లు సష్టించే ప్రయత్నం చేశారన్నారు. పాదయాత్ర విఫలం కావడంతో అసహనానికి గురై ఇటువంటి ఘటనలకు పాల్పడటం సరైంది కాదని పేర్కొన్నారు.

ఐటి శాఖకు అందరూ సమానమే

గజపతినగరం : ఐటి శాఖకు అందరూ సమానమేనని, తప్పు చేస్తే ఏ స్థాయి నాయకుడినైనా అరెస్టు చేసే అధికారం వారికుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను అరెస్టు చేస్తారంటూ చంద్రబాబు వగలమారి ఏడుపులు ఏడుస్తున్నారని, వాటి నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని చెప్పారు. స్థానిక టిడిపి నాయకులు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధితో ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. దమ్ముంటే వాటిని నిరూపిస్తే రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ చేశారు. సమావేశంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, సర్పంచులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, నాయకులు లెంక గణేష్ పాల్గొన్నారు.

బొగ్గు లారీలతో బతుకులు బుగ్గిపాలు

లారీలను అడ్డుకున్న కంటకాపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి-కొత్తవలస

కంటకాపల్లి రైల్వేస్టేషన్ నుంచి వస్తున్న బొగ్గు లారీలను నిలుపుదల చేయాలని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కంటకాపల్లి బొగ్గు యార్డు నుంచి రవాణా చేస్తున్న లారీల వల్ల వస్తున్న దుమ్ము, ధూళితో తమ బతుకులు ఆస్పత్రి పాలవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన చెందారు. ఈ మేరకు కంటకాపల్లి రైల్వేయార్డ్ నుంచి వస్తున్న బొగ్గు లారీలను అంబేద్కర్ కాలనీ వద్ద శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. నాయకులు మదిన అప్పలరాం, బోదల సురేష్ కుమార్, కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, చినరావుపల్లి సర్పంచ్ గోసాల దేవుడు, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ప్రజలు రోడ్డుకు అడ్డంగా బైఠాయించారు. ఎన్ని సంవత్సరాలైనా పరిస్థితి ఇలానే ఉంటుందని, ఇప్పటికైనా ఒక కొలిక్కి రావాలని భీష్మించుకు కూర్చున్నారు. సాయంత్రం వరకు టెంట్ వేసుకుని కాపలా కాశారు. సమస్యకు పరిష్కారం దొరికే టెంటును కొనసాగిస్తామని అప్పలరాం స్పష్టంచేశారు.

లారీలను అడ్డుకుంటున్న కంటకాపల్లి గ్రామస్తులు

ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

బొగ్గు కాంట్రాక్టరు రావడం లేదు : ఎమ్మెల్యే

కంటకాపల్లి రైల్వే యార్డు పరిస్థితి దుర్భర స్థితిలో ఉందని, రైల్వే కాంట్రాక్టరుతో మాట్లాడి రోడ్డు వేయించాలని ఎన్నిసార్లు ఫోన్ చేసి చెప్పినా కనీసం పట్టించుకోలేదని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చెప్పారు. కంటకాపల్లి గ్రామస్తుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడుబండి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. దుమ్ము, ధూళితో ఇక్కడి ప్రజలు ఎలా జీవించగలరని స్థానికులు ప్రశ్నించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ రైల్వే కాంట్రాక్టరును రప్పించి, ఇక్కడే మాట్లాడాలని తెలిపారు. రైల్వేస్టేషన్ నుంచి బొగ్గు రవాణా చేస్తున్న కారణంగా విద్యార్థులు, అంగన్వాడీ చిన్నారులు ప్రతిరోజూ చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనా ఇక్కడ పరిస్థితి చక్కదిద్దే వరకు సమస్య పరిష్కారం కాదన్నారు.

లక్ష్మీపురం సచివాలయానికి తాళాలు

ఎమ్‌పి, ఎమ్మెల్యే కార్యక్రమం కోసమని దుమ్మా

ప్రజాశక్తి-రేగిడి

తాళం వేసి ఉన్న లక్ష్మీపురం సచివాలయం

మండలంలోని లక్ష్మీపురం సచివాలయ ఉద్యోగులు మధ్యాహ్నం మూడున్నరకే సచివాలయానికి తాళాలు వేసి ఇంటి ముఖం పట్టారు. ప్రజలకు అన్ని రకాల సేవలు అందించాల్సిన సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ముందుగానే తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో వివిధ పనుల కోసం వచ్చిన అర్జీదారులు నిరీక్షించారు. సాయంత్రం ఐదున్నర వరకు అర్జీదారులు వేచి చూసి, ఉద్యోగులు తిరిగి సచివాలయానికి రాకపోవడంతో వెనుదిరిగారు. ఉంగరాడమెట్ట వద్ద ఎమ్‌పి, ఎమ్మెల్యే కార్యక్రమం ఉదయం జరిగినా, అక్కడికి వెళ్లామని చెబుతూ విధులకు దుమ్మాకొట్టారని కొంతమంది ఉద్యోగులు చెబుతున్నారు.

వెంకటరామ పొల్ట్రీస్ మొండివైఖరి వీడాలి

ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-గరివిడి

వెంకట రామ పౌల్ట్రీస్ యాజమాన్యం మొండివైఖరి అవలంభిస్తోందని సిఐటియు జిల్లా నాయకులు టివి రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పౌల్ట్రీ కార్మికులు విధులు బహిష్కరించి చీపురుపల్లిలో రావివలస రోడ్డు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ సురేష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్లాం గ్రామంలోని వెంకటరమణ పౌల్ట్రీస్ యాజమాన్యం వేతన ఒప్పందం కాలపరిమితి గత మే నెలతో ముగిసిందని, కొత్తగా వేతన ఒప్పందం చేసుకుని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి యాజమాన్యం తాత్సారం చేయడం సరికాదన్నారు. పురుష కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలు, మహిళలకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంబల్ల గౌరినాయుడు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.గురునాయుడు, పి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

15లోగా ఓటరు వెరిఫికేషన్ పూర్తి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ లో భాగంగా అందిన క్లెయిమ్‌ల న్నిటినీ ఈనెల 15 లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తహశీల్దార్లను ఆదేశించారు. ఫారం 6, 7,8 ల ద్వారా అందిన క్లెయిమ్స్ శత శాతం ఫిజికల్ వెరిఫికేషన్ చేసి ఈనెల 15 లోగా ఇఆర్‌ఒ లాగిన్ లోకి ఫైనల్ రిపోర్ట్ పంపాలని సూచించారు. శుక్రవారం ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒ లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫారం 6,7,8 ల ద్వారా ఓటర్ల నమోదుకు, షిఫ్టింగ్‌కు, తొలగింపునకు జిల్లాలో మొత్తం 101283 క్లెయిమ్స్ అందాయని, వాటిలో ఇప్పటివరకు 20శాతం పరిష్కారం అయ్యాయని, మిగిలిన 80 శాతం వెంటనే బిఎల్‌ఒ లాగిన్‌లోకి పంపించి వారు వ్యక్తిగతంగా వెరిఫై చేసేలా చూడాలని తెలిపారు. రెండు రోజుల్లో బిఎల్‌ఒల వెరిఫికేషన్ పూర్తి చేసి ఎఇఆర్‌ఒ లాగిన్ లోకి పంపాలని ఆదేశించారు. ఫారం 7 ద్వారా దరఖాస్తు చేసుకున్నవారికి వారం ముందే నోటీసు లను రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపాలని తెలిపారు. ఒకే డోర్ నెంబర్ లో 10 మందికి మించి ఓటర్లు ఉన్న చోటా మరో సారి క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితాల వెరిఫికేషన్ తో పాటు పోలింగ్ స్టేషన్ల తనిఖీలు కూడా తహశీల్దార్లు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతిరావు, ఆర్‌డిఒ సూర్యకళ , తహశీల్దార్లు, ఎన్నికల డిటి లు, ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులతో కోచ్

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం టౌన్ : ఒంగోలులో ఈనెల 8నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్ 13 బాల బాలికల బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు విజయనగరం జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు వెళ్లారు. వీరిలో ఎం.జాన్సన్, సిహెచ్ హిమతేజ, ఎస్. లికిత్, ఎమ్‌డి నిషిథ ఫాతిమా, ఎస్.లాస్య ఉన్నారు. వీరిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డాక్టర్ విఎస్ ప్రసాద్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని కార్యదర్శి వై.కుసుమ బచ్చన్ ఆకాంక్షించారు.

పట్టాలిచ్చారు.. ఆన్‌లైన్ మరిచారు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కాపుసోంపురం రెవెన్యూ పరిధిలో దబ్బగుంట, జిల్లోడిలోవాకు చెందిన 14 మంది గిరిజన రైతులకు 26 ఎకరాల అసైన్డ్ భూమికి పట్టాలు ఇచ్చారు. ఆ భూముల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు అందడం లేదు. అసైన్డ్ పట్టాలిచ్చిన భూమిని రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ, పోరంబోకు భూమిగా చూపించడం గమనార్హం. దీనిపై వెంటనే రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి, పట్టాల ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు జె.గౌరీష్ ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు.

బిజెపి జిల్లా అధ్యక్షులుగా ఎన్ఇఆర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

నడుకుదిటి ఈశ్వరరావు

బిజెపి విజయనగరం జిల్లా అధ్యక్షులుగా నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డి.పురందేశ్వరి జిల్లా అధ్యక్షులను శుక్రవారం ప్రకటించారు. విజయనగరం పార్లమెంటు స్థానం పరిధిలోని శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం గ్రామానికి చెందిన ఎన్ఇఆర్ మండల రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. 2014లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో టిడిపి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కిమిడి కళావెంకటరావు విజయంలో ఎన్ఇఆర్ కీలకపాత్ర పోషించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్‌గా సేవలందించారు. 2019 జులైలో అప్పటి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో బిజెపిలో చేరారు. ఓ వైపు రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్న ఎన్ఇఆర్.. నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. దీంతో ఆయన్ను బిజెపి అధిష్టానం విజయనగరం జిల్లా అధ్యక్షులుగా నియమించింది. ఈ నేపథ్యంలో పలువురు నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు మంత్రి బొత్స సత్యనారాయణ రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం జిల్లాకు వస్తున్నారు. ఉదయం 6 గంటలకు నగరంలోని తన నివాసానికి చేరుకుంటారు. 10 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో కలసి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు ఎయు స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు విశాఖ వెళ్తారు.

పోలీసు సంక్షేమ దివాస్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పి ఎం.దీపిక పోలీసు సంక్షేమ దివాస్ నిర్వహించి, పోలీసు సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వ్యక్తిగత, ఉద్యోగ సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సాదాసీదాగా ప్రజావేదిక

ప్రజాశక్తి-బొండపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదాగా సాగింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనులు, తదితర అంశాలను సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించాయి. ముఖ్యంగా మండలంలో ఎన్ఆర్ఇజిఎస్ కింద 1384 పనులు, పంచాయతీ రాజ్ కింద 24 పనులు, సమగ్ర శిక్ష కింద 5 పనులు, సోషల్ ఫారెస్ట్ కింద 1 పని చేపట్టారు. కార్యక్రమంలో డివిఎఒ ఎస్.రవీంద్ర, ఎపిపి చలంనాయుడు, ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్, ఎపిఒ బి.కృష్ణవేణి, ఎపిడి టి. జనార్దనరావు, ఎపిఒ వివి.లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు అభినవ్ ఎంపిక

ప్రజాశక్తి-బొబ్బిలి

హిందూపురంలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సంస్థానం పాఠశాల విద్యార్థి అభినవ్ యాదవ్ ఎంపికైనట్లు హెచ్ఎం సునీత తెలిపారు. ఉత్తరాంధ్ర స్థాయిలో అభినవ్ యాదవ్ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అభినవ్ యాదవ్‌ను పాఠశాల కార్యదర్శి ఆర్.బదరి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్పందన ఫిర్యాదుపై దర్యాప్తు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని రుషింగి గ్రామానికి చెందిన అంధుడు గుడివాడ సూర్యనారాయణ కుటుంబాన్ని ఓ వ్యక్తి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని స్పందన కార్యక్రమంలో ఎస్‌పికి ఫిర్యాదు అందింది. దీంతో రాజాం రూరల్ సిఐ ఉపేంద్రరావు శుక్రవారం రుషింగి గ్రామంలో విచారణ చేపట్టారు. బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తితో కూడా సిఐ మాట్లాడి, హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలో వివిధ దశలలో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎన్.దుర్గాప్రసాద్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు, ఆర్‌బికె, గ్రామ సచివాలయాలు, తదితర భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న గృహాలను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఎంపిపి చలంనాయుడు మాట్లాడుతూ వర్షాల ప్రభావం వల్ల గ్రామాలలో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్, తహశీల్దార్ ప్రసాద్‌రావు, సిడిపిఒ ఉమాభారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలిన షెడ్

ప్రజాశక్తి-వేపాడ

వర్షానికి కూలిపోయిన రేకుల షెడ్

వల్లం పూడి పోలీస్‌స్టేషన్ వద్ద బ్రిటిష్ పాలనలో నిర్మించిన భవనానికి ఆనుకుని ఉన్న రేకుల షెడ్ శుక్రవారం కూలిపోయింది. మూడు రోజులుగా పడుతున్న అడపాదడపా వర్షానికి నాని కుప్ప కూలిపోయింది. ఈ షెడ్డులో స్టేషన్ సిబ్బంది వాహనాలు పెట్టుకునేవారు. అప్పుడప్పుడు స్టేషనుకు వచ్చిన ఫిర్యాదుదారులు కూడా వేచి ఉండేవారు. షెడ్ కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

వాలంటీర్ల తొలగింపు రాజకీయ కక్షే

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని కొప్పెర్ల సచివాలయ పరిధిలో ఇద్దరు వాలంటీర్లను తొలగించడం రాజకీయ కక్షేనని సర్పంచి సంకాబత్తులు సత్తిబాబు ఆరోపించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొప్పెర్ల సచివాలయ పరిధిలోని అడ్డగర్ల పావని, సంకాబత్తుల గౌరిని అకారణంగా వాలంటీర్ విధుల నుండి తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వంపైన, గ్రామపెద్దలపైన, అధికారులపైన వ్యతిరేక పదజాలంతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తొలగించినట్లు నివేదికలో పేర్కొన్నారని తెలిపారు. ఇదంతా రాజకీయ కక్షేనని ఎవరిని అడిగినా చెబుతారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనపై ఓటమిని జీర్ణించుకోలేకే ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయం పార్టీ పెద్దల ముందు పెడతానన్నారు. ఇలాంటి రాజకీయాలు మానుకోకపోతే భవిష్యత్తు అంధకారంగా మారిపోతుందని తెలుసుకోవాలని హెచ్చరించారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం, చామలాపల్లి, వేపాడ పాఠశాలలను శుక్రవారం ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. విద్యార్థుల దినచర్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్క్‌బుక్స్, నోట్స్, విద్యార్థులకు ఇస్తున్న మెనూ రికార్డులను, డైరీలను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక కోర్టులో శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ కోరారు. లోక్ అదాలత్‌పై శుక్రవారం కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సివిల్, బ్యాంకు తగాదాలు, ప్రీలిటిగేషన్, రాజీ కాబడిన క్రిమినల్ కేసులను రాజీచేస్తామని చెప్పారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

పోషణ మహా కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీలు

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. పట్టణంలోని గంగుల వీధి, వీవర్స్ కాలనీ, పాకివీధిలో పోషణ మహా అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యం కోసమే ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందన్నారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల మొదటి వారం నుంచి నెలాఖరు వరకు పోషణ అభియాన్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

తెర్లాం : మండలంలోని కొరటాం గ్రామ సచివాలయ పరిధిలో పోషన్ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, ప్రీ స్కూలు పిల్లలకు ఏ విధమైన పోషణ అందించాలో వివరించారు. గ్రామ సర్పంచ్ కె.సాయిరాం మాట్లాడుతూ అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

మలిచర్లలో అక్షరాస్యతా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం శుక్రవారం వయోజన విద్య ఉపసంచాలకులు అల్లు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో మలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ప్రధానోపాధ్యాయులు సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి రాజేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అక్షరాస్యతా వారోత్సవాలు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సహాయ ప్రాజెక్టు అధికారి సిహెచ్ లక్ష్మి విద్యార్థులతో అక్షరాస్యతా ప్రతిజ్ఞ చేయించారు.

పక్కా రహదారుల నిర్మాణానికి పెద్దపీట

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్‌పి చంద్రశేఖర్

ప్రజాశక్తి-రేగిడి

పక్కా రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఈ మేరకు ఉంగరాడమెట్ట వద్ద చిన్నయ్యపేట సెంటర్ నుంచి రాజాం జిఎంఆర్ఐటి వరకు, రాజాం గాయత్రి కాలనీ నుంచి బొబ్బిలి సెంటర్ వరకు 18.5 కిలోమీటర్ల మేర రూ.9 కోట్లతో నూతనంగా తారురోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకొండ- రాజాం ప్రధాన రహదారిలో ఎన్నో ఏళ్లనాటి ఇబ్బందులు ప్రజలకు తీరినట్టేనన్నారు. ఆర్అండ్‌బి డిఇ కె.వి ప్రసాదరావు మాట్లాడుతూ ప్రధానరహదారి నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపిపి ధార అప్పలనరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వి.జగన్మోహనరావు, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, ఉమ్మడి శ్రీకాకుళం వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైసిపి నాయకులు తలే రాజేష్, పి.శ్రీనివాసరావు, వి.చక్రపాణి, రేగిడి, సంకిలి సొసైటీ అధ్యక్షులు వంజరాపు అశోక్, వేణు, తహశీల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తి, ఆర్అండ్‌బి జెఇ నాగభూషణరావు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోండి

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థులు చదువుతోపాటు మానసిక ఆరోగ్యాన్ని సమతుల్యం చేసుకోవాలని మనస్తత్వ వేత్త, సామాజిక కార్యకర్త ఎవి రాజశేఖర్ అన్నారు. 'జీవితాన్ని పునరుజ్జీవింప చేయండి..శరీరాన్ని చైతన్యం చేయండి' అనే అంశంపై సీతం కళాశాలలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య బంధం, ఆరోగ్యకరమైన స్నేహం ఎంపిక ప్రాముఖ్యతను వివరించారు. అవసరమైన సమయంలో విద్యార్థులు వారి స్నేహితులకు సలహా ఇవ్వాలని కూడా విద్యార్థులను ప్రోత్సహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ్ రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవాలని తద్వారా జీవితాన్ని ఆస్వాదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వరూధిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శంబంగి

సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కొండకెంగువలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని బుక్‌లెట్ల రూపంలో పంచిపెట్టారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా ప్రజలందరికీ తమ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందజేస్తూ అండగా ఉందన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే శంబంగికి స్థానిక నాయకులు, ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపిపి బెల్లాన ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, జెసిఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, తహశీల్దార్ రాజారావు, వైసిపి నాయకులు ప్రసాద్, చంద్రశేఖర్, పైడిరాజు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

ప్రజాశక్తి-తెర్లాం

బాడంగి.. సమీక్షలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ వైద్యసిబ్బందితో సమీక్షించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యం, పాటించాల్సిన విధివిధానాలపై సూచనలు చేశారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. రిఫరల్ కోసం ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా వాలంటీర్లు తమ క్లస్టర్‌లోని ఇంళ్లకు వెళ్లి జెఎఎస్, ఎఎన్ఎం సందర్శన షెడ్యూల్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

బాడంగి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపిడిఒ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి సిహెచ్.సూర్యచంద్ర రావు సమీక్షించారు. ఎంపిడిఒ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాలకు వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించాలని తెలిపారు. ఆ సమాచారం ఆధారంగా ఎఎన్ఎంలు, సిహెచ్‌ఒలు ఈ నెల 16 నుంచి ఇంటింటికి వచ్చి బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అదే గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. వైద్య శిబిరాల్లో 105 రకాల ఔషదాలు అందుబాటులో ఉంటాయని, వైద్య పరీక్షలన్నీ అక్కడే నిర్వహిస్తారని తెలిపారు.

కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేయడం అభినందనీయమని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద అసోసియేషన్ సాయి కొరియన్ క్యాంపస్ చాలెంజ్ పునారావాస కేంద్రంలో వికలాంగులకు ఐవాక్స్ పేపర్ కెమికల్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైనిక్ స్కూల్ పూర్వ విద్యార్థులతో నిర్వహిస్తున్న క్యాంపస్ ఛాలెంజ్ సేవలను కొనియాడారు. ఐవాక్స్ డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ తమ సహాయ సహకారాలు నిరంతరం క్యాంపస్ ఛాలెంజ్‌కు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సైనిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ విశాఖపట్నం చాప్టర్ ప్రెసిడెంట్ యు.శేఖర్ మాట్లాడుతూ 150 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాల తయారీకి ఐవాక్స్ పేపర్ కెమికల్ వారు రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లో సెక్రెటరీ జిఆర్‌సి బోస్, బోర్డు సభ్యులు, క్యాంపస్ ఛాలెంజ్ డైరెక్టర్ ఆర్ఎల్ఎన్ శర్మ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఎంపిడిఒ జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తోడపుట్టిన వారు కూడా చూడని ఈ రోజులలో నెల నెలా ఠంచనుగా పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. డబ్బులు లేకపోయినా వీరికి టిఫిన్ దుకాణాలలో చాలా చోట్ల నెలంతా టిఫిన్ ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్తగా 337 మంది అర్హులను గుర్తించి, పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్ యడ్ల కిశోర్‌కుమార్, వైస్ ఎంపిపి శ్రీనురాజు, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ ఖాసిం, సర్పంచులు ఆదిరెడ్డి అర్జున, గోకాడ ముసలినాయుడు, ముమ్మన ప్రసాదరావు, కొయ్యన కృష్ణ, సోంబాబు, ఆవాల సత్యనారాయణ, పినిశెట్టి కిష్టప్పదొర, జామి అప్పలరాజు, ఎఎంసి డైరెక్టర్ కొట్యాడ శ్రీనివాసరావు, ఎంపిటిసిలు భూమిరెడ్డి స్వామినాయుడు, బోకం అప్పారావు, కవలపల్లి జక్కన్నదొర, లెక్కల వీరబాబు, తూర్పాటి అప్పలరాజు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు

బరువు తక్కువ ఉన్న పిల్లలను పరిశీలిస్తున్న ట్రైయినీ కలెక్టర్ వెంకట్

ప్రజాశక్తి-వంగర

మండలంలోని శివ్వాం అంగన్వాడీ - 1, 2 కేంద్రాలను ట్రైయినీ కలెక్టర్ సహదిత్ వెంకట్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ రెండు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. బరువు తక్కువ గల పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి, వివరాలు సేకరించారు.

బాగా బరువు తక్కువ ఉన్న ఇద్దరు పిల్లలను గుర్తించి, వారి ఆరోగ్యం బాగా మెరుగుపరిచేందుకు విజయనగరంలోని ఎన్ఆర్‌సికి పంపించాలని సూచించారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ కనకదుర్గ, ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు, డిటి బి.సుందరరావు, ఎంఆర్ఐ జామి మురళి, వైద్యాధికారి సుష్మత డయానా, ఐసిడిఎస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎల్.నారాయణరావు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నేత గొంప కృష్ణ, నాయకులు

చంద్రబాబుతో భవిష్యత్తుకు గ్యారెంటీ

టిడిపి నాయకులు గొంప కృష్ణ

ప్రజాశక్తి-కొత్తవలస

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారానే యువత భవిష్యత్తుకు గ్యారెంటీ అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి కొత్తవలస మండలం సీతంపేట గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గొరపల్లి రాము ఆధ్వర్యంలో కృష్ణకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే బాగా అభివృద్ధి జరిగిందని అన్నారు. వైసిపి హయాంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు.టిడిపి అధికారంలోకి వస్తే పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షుడు లెంక శ్రీనివాసరావు, జామి మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, భీశెట్టి ప్రసాద్, పలువురు మాజీ సర్పంచులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గంట్యాడ

గజపతినగరం.. సమావేశంలో మాట్లాడుతున్న ఎడి మహారాజన్

ప్రతి రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని చైర్మన్ రంధి రామునాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులను అందించాలన్నారు. పనిముట్లు, ఆయిల్ ఇంజిన్లు, టార్పాలిన్లు, స్ప్రేయర్లు పంపిణీ చేయాలని సూచించారు. ఉద్యానశాఖ ద్వారా మండలానికి పామాయిల్ యూనిట్ మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్‌కుమార్, లక్కిడాం పిఎసిఎస్ అధ్యక్షులు లచ్చిరెడ్డి కృష్ణ, ఎఒ పి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని ఎడి కె.మహారాజన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట విస్తీర్ణం, పంట నమోదు ప్రక్రియ గురించి వివరించారు. ఉద్యానశాఖ, ఆయిల్‌పాంకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను ఉద్యాన శాఖాధికారి రాజశేఖర్ వివరించారు. కార్యక్రమములో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు, ఎఒ ధనలక్ష్మి, డిటి సత్యనారాయణ, ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ సుదర్శన్ పాల్గొన్నారు .

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి-దెంకాడ

మండలంలోని మోపాడ పాఠశాలలో విద్యార్థులకు నేత్రదానంపై హెచ్ఎం భవాని అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మోపాడ పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ నేత్రదానం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా, కుటుంబ సంప్రదాయంగా గుర్తించి ముందుకురావాలన్నారు. మరణాంతరం ఒకరు చేసే నేత్రదానం ఇద్దరు అంధులకు చూపునిస్తుందన్నారు. నేత్ర వైద్యాధికారి మజ్జి గణపతిరావు మాట్లాడుతూ నేత్రదానంపై అపోహలు వీడాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నేత్రదానంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సూరిఅప్పారావు పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-దెంకాడ

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త తేజేశ్వరరావు

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరికి వచ్చే ఆకుముడత, కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, పాముపొడ తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె.తేజేశ్వరరావు అన్నారు. శుక్రవారం సింగవరం గ్రామంలో వ్యవసాయాధికారి పి.నిర్మల అధ్యక్షతన రైతులతో పొలంబడి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తేజేశ్వరరావు మాట్లాడుతూ వరికి వచ్చే తెగుళ్లు, నివారణ చర్యలు గురించి వివరించారు. జిల్లావనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ వరిలో కలుపు యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎడి వి.హరికృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి బి.రామకోటి, పి.అప్పారావు, టి.గురునాధరావు, అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

తంగుడుబిల్లిలో పొలంబడి

నెల్లిమర్ల : మండలంలోని తంగుడుబిల్లిలో శుక్రవారం ఎఒ పూర్ణిమ ఆధ్వర్యాన పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పిలకలు, ఆకుల కత్తిరింపులు, పిలకలు వచ్చే సమయంలో నీరు పెట్టు విధానం, శత్రు, మిత్ర పురుగుల గుర్తింపు, పొలం పరిసరాల విశ్లేషణ, కాలిబాటల గురించి ఆమె అవగాహన కల్పించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించాలని సూచించారు. వరిపంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నాగరాజు, విఎఎ శివ పాల్గొన్నారు.